

కాలనీవాసులతో కార్పొరేటర్ నర్సింహారెడ్డి

కమ్యూనిటీహాల్ ప్రారంభం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్‌లోని అనితానగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తమ సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనాన్ని ఆదివారం జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యంగా ఉంటూ కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవటం అభినందనీయమన్నారు. కాలనీలో ఏ సమస్యలు ఉన్నా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు భాస్కరాచారి, వేణుగోపాల్‌రావు, వైద్యనాథ్, సతీష్, మారుతీ, శ్రావణ్‌కుమార్, బాబూరావు పాల్గొన్నారు.



రెడ్డికాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

చంపాపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని రెడ్డికాలనీలో జీహెచ్ఎంసీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ఆదివారం పరిశీలించారు. అనంతరం కాలనీలో కార్పొరేటర్ పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి అంజిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.



గాయిత్రినగర్ బ్యాంక్ కాలనీ నూతన కమిటీ సభ్యులు

గాయిత్రినగర్ బ్యాంక్ కాలనీ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ బ్యాంక్ కాలనీ నూతన కమిటీని ఆదివారం కాలనీలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా దగ్గుబాటి లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిగా సచ్చి రవికుమార్, ఉపాధ్యక్షుడిగా గడల శేఖర్, సహాయ కార్యదర్శిగా బొంకూరు ఉపేందర్, కోశాధికారిగా ఎన్.సీ మనోహర్ ఎన్నికయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు.



ఎన్నికైన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీసాయినగర్ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్‌లోని శ్రీసాయినగర్ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షుడిగా బద్దం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.రేవంత్‌రెడ్డి, ఏలె సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ఉమేశ్‌గౌడ్, కోశాధికారిగా పీఎస్ రాము, సంయుక్త కార్యదర్శులుగా కె.పరమేశ్వర్‌రెడ్డి, ఎస్.శివకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.వీరకృష్ణారెడ్డి, పోలంపల్లి బుచ్చి రాము ఎన్నికైనట్లు తెలిపారు. అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యవర్గం త్వరలో సమావేశమై మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటుందన్నారు. కాలనీ సమస్యలను ప్రజా ప్రతినిధుల వద్దకు తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



తిరుమలనగర్ కాలనీ నూతన కార్యవర్గం సభ్యులు

తిరుమలనగర్ కాలనీ కార్యవర్గం

హయత్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ తిరుమలనగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కాలనీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ నూతన అధ్యక్షుడిగా పబ్బు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శిగా సుంకరి భాస్కర్‌గౌడ్, కోశాధికారిగా జగదీష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సేవ్యనాయక్, పాండురంగారెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా ఈశ్వర్, సహాయ కార్యదర్శులుగా భిక్షంచారి, హుస్సేన్, గౌరవ అధ్యక్షులుగా నరేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, ముఖ్య సలహాదారులుగా నరసింహగౌడ్, రాంరెడ్డి, సలహాదారులుగా సుధాకర్‌చారి, నాగరాజు ఎన్నికయ్యారు.

మలక్‌పేట రైల్వే స్టేషన్, మెట్రో స్టేషన్లలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు



మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు, పక్కన సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ జానకి దరావత్, ఏసీపీ శ్యాంసుందర్

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికలను పురస్కరించుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం రాత్రి చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు చోట్ల పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ దరావత్ పర్యవేక్షణలో మలక్‌పేట ఏసీపీ శ్యాం సుందర్, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డితో కూడిన పోలీసుల బృందం అనుమానాస్పద వ్యక్తులను, వస్తువులను తనిఖీ చేశారు. మలక్‌పేట రైల్వే స్టేషన్, మలక్‌పేట మెట్రో స్టేషన్, న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్‌లో పోలీసులు ప్రయాణికులను, వారి వెంట ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీసీపీ సూచించారు.

నిలిచి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే వ్యక్తి మృతి, నలుగురికి గాయాలు
- నల్లగొండ జిల్లా కట్టంగూరులో ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలయ్య



గాయపడిన చందన, నమీష్, అంకృత



జాతీయ రహదారిపై ట్యాంకర్ కిందికి దూసుకెళ్లిన కారు





నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చందన, నమీష్

కట్టంగూరు, ఫిబ్రవరి 25 : నల్లగొండ జిల్లా కట్టంగూరు మండల పరిధిలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ట్యాంకర్‌ను అతివేగంతో కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన కట్టంగూరు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్(ఎల్బీనగర్) అలకాపురికాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గోవింద్ బాలయ్య (50) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున ఏపీ28డీఎన్ 9972 కారులో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ఎర్రవరం లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి బయలుదేరారు. తమ్ముడి కుమార్తె అనారోగ్యంగా ఉండటంతో దేవాలయానికి వెళ్తున్నారు. ఇందుకోసం అపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ వ్యక్తికి చెందిన కారుకు బాలయ్య ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన, డ్రైవర్‌గా పనిచేస్తున్న లింగస్వామి వెంటవచ్చాడు. బాలయ్య ముందు సీట్లో కూర్చోగా, లింగస్వామి వాహనం నడుపుతున్నాడు. బాలయ్య తమ్ముడు కుమార్తె చందన, లింగస్వామి కుమారుడు నమీష్, కుమార్తె అంకృతలు వెనుక కూర్చున్నారు. కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం వద్ద అతివేగంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో రహదారికి ఎడమవైపు దూసుకెళ్లింది. ఈ క్రమంలో హైవే పక్కన వాహనాల విశ్రాంతి ప్రదేశంలో నిలిపి ఉన్న ట్యాంకర్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జయి బాలయ్య అక్కడికక్కడే మృతిచెందగా, వాహనం నడుపుతున్న లింగస్వామితో పాటు ఆయన కుమారుడు నమీష్, కుమార్తె అంకృత, ఆయన బాబాయ్ కుమార్తె చందనలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. బాలయ్య మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బాలయ్య భార్య, కోడలు ఇంటి వద్దనే ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ఎన్‌టీఆర్‌నగర్ వాసుల కష్టాలు తీరుస్తాం

- మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసిన ఎన్‌టీఆర్‌నగర్ వాసులు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్‌నగర్ వాసుల కష్టాలు తీరుస్తామని మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్‌నగర్ వాసులు లక్ష్మారెడ్డిని ఆదివారం తుక్కుగూడలోని ఆయన క్యాంప్ ఆఫీస్‌లో కలిశారు. దశాబ్దాలుగా తమ ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన గత ప్రభుత్వం నేటి వరకు సమస్యను పరిష్కరించలేదని వారు లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ విషయం అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు లేని కుటుంబం, సమస్యలు లేని బస్తీలుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్నా గణేష్‌నేత, రమేష్‌గౌడ్, ఢకియార్‌నాయక్, అల్లావుద్దీన్‌పటేల్, దుబ్బాక శేఖర్, ఫరీద్‌పాష తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్‌ను తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



కర్మన్‌ఘాట్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్‌ను తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

చంపాపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ సాగర్‌రోడ్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను ఆదివారం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు మాచన రఘునందన్, పఠాన్ హైదర్ అలీ పెట్రోల్ బంక్‌ను పూర్తిగా తనిఖీ చేసి వినియోగదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంక్‌కు విచ్చేసే వినియోగదారులను ముఖ్య అతిథులుగా పరిగణించి వారికి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పెట్రోల్‌లో కల్తీ ఉన్నట్లు అనుమానించడం కంటే సందేహ నివృత్తి కోసం ఫిల్టర్ పేపర్‌తో పరీక్ష చేసుకోవాలని వారు వినియోగదారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో పెట్రోల్‌ను విడిగా బాటిళ్లలో పోయవద్దని, లూస్‌సేల్స్ నియమ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. వేసవికాలం దృష్ట్యా వినియోగదారులకు మంచినీరు అందించాలని సూచించారు.

మేయర్ బీఆర్ఎస్.. డిప్యూటీ మేయర్ కాంగ్రెస్..!

(5వ పేజీ తరువాయి)

పాలనాపరంగానూ బీఆర్ఎస్ మేయర్‌కు అధికారుల సహకారం పూర్తిస్థాయిలో అందకుండా ప్రభుత్వపరంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల అధికారులు టార్గెట్‌గా పాలకమండలి సభ్యులు మండిపడ్డారు. డిప్యూటీ మునిసిపల్, జోనల్ కమిషనర్ల వైఖరిని ప్రస్తావిస్తూ పరోక్షంగా కమిషనర్ తీరునూ ఎండగట్టారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ తరఫున కార్పొరేటర్లు మాత్రమే ఉండగా.. ఇప్పుడు డిప్యూటీ మేయర్ తోడయ్యారు. దీంతో సంస్థలో మరో అధికార కేంద్రం మొదలయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇంతకు ముందు నామ్ కే వాస్తే అన్నట్టుగా ఉన్న శ్రీలతారెడ్డి.. అధికార పార్టీలో చేరిన దృష్ట్యా.. ఇక సమీక్షలు, సమావేశాలు నిర్వహించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తుత బలాబలాలు

పార్టీ	సభ్యులు
బీఆర్ఎస్	52
ఎంఐఎం	42
బీజేపీ	40
కాంగ్రెస్	12
మొత్తం	147

(ఖాళీగా మూడు స్థానాలు)

అవిశ్వాసం పెట్టలేరు..

2020 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 56 స్థానాల్లో గెలిచింది. బీజేపీ నుంచి ఆరుగురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ కార్పొరేటర్ ఒకరు గులాబీ పార్టీలో చేరారు. అయినా, ప్రస్తుతం కౌన్సిల్‌లో ఆ పార్టీ బలం 52కు తగ్గింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన 10 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి చేరడమే ఇందుకు కారణం. కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 12కు పెరిగింది. గులాబీ పార్టీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లూ త్వరలో అధికార పార్టీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే మరో ఏడాది తర్వాత బీఆర్ఎస్ బలం ఎంతుంటుందన్నది చెప్పలేని పరిస్థితి. బీజేపీ సభ్యుల సంఖ్య 40, ఎంఐఎం సభ్యుల సంఖ్య 42గా ఉంది. బీజేపీకి చెందిన ఓ కార్పొరేటర్ మరణించగా.. ఎంఐఎం నుంచి ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని మునిసిపాల్టీలు, కార్పొరేషన్లలో పురపాలక శాఖ చట్టం ప్రకారం మూడేళ్ల అనంతరం అవిశ్వాసం పెట్టే అవకాశముంది. గతంలో దీనిని నాలుగేళ్లకు సవరిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ప్రతిపాదన పంపింది.

ఆమె ఫైల్‌ను వెనక్కి పంపడంతో చట్టసవరణ జరగలేదు. గతంలో గవర్నర్ ఆమోదించిన పక్షంలో ప్రస్తుతం మునిసిపాల్టీలు, కార్పొరేషన్లలో అవిశ్వాసానికి అవకాశం ఉండేది కాదు.

హజ్ యాత్రకు 7,811 మంది ఎంపిక

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- తొలి అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 7,811 మంది హాజీలు వెళ్లనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఈసారి 11,313 మంది దరఖాస్తు చేసుకున్నారని, హజ్ కమిటీ కోటాలో 7,811 మంది ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేటలో తెలంగాణ హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికుల కోసం నిర్వహించిన మొదటి అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారి కోసం సౌదీ అరేబియాలోని మక్కాలో రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ ద్వారా భోజనం, ఉండేందుకు వసతులు కల్పిస్తుందన్నారు. 7,811 మంది హాజీల్లో హైదరాబాద్‌కు చెందిన వారు 4వేల మందిపైగా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుసేనీ తెలిపారు. మొదటి విడతగా రూ.80,800 చెల్లించాల్సి ఉండగా ఎంపికైన 1,316 మంది చెల్లించకపోవడంతో వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టామని, రెండో విడతగా రూ.1.70లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ రెండు వాయిదాలు కలిపి మార్చి 10న రాష్ట్ర హజ్ కమిటీకి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సౌదీ ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాకా మూడో విడత చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో హజ్ యాత్రికునికి రూ.3.50లక్షల వరకు ఖర్చవుతుందని సూచనప్రాయంగా తెలిపారు. వచ్చే మే 9 నుంచి హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతారన్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 20 అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల, టీపీసీసీ కార్యదర్శి మక్సూద్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు బాలకిషన్ రాజీనామా

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ ఆదివారం తన పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. తనను అయిదు సంవత్సరాల క్రితం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల పరిధిలోని లక్షా నలభై వేలమంది ఓటర్లను నిర్లక్ష్యం చేసి ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయనందుకు పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన చెప్పారు. రాజీనామా లేఖను ఎమ్మెల్యే సబితారెడ్డికి పంపించినట్లు తెలిపారు.

మెట్రోలో నగదు, నగలు చోరీ

యుసుఫ్‌గూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెట్రోలో చోరీ జరిగింది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిషేక్ అభిదత్తా ఈనెల 13న ఎర్రమంజిల్ నుంచి అమీర్‌పేటకు మెట్రో రైలులో ప్రయాణించాడు. అమీర్‌పేటలో దిగి పర్సు చూసుకోగా కనిపించలేదు. దీంతో పోలీసులకు అదేరోజు ఫిర్యాదు చేశాడు. పర్సులో రూ. 1,200, రూ. 50 వేల విలువగల గోల్డ్‌చైన్ ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసును మధురానగర్ పీఎస్‌కు ఆదివారం బదిలీ చేశారు.

వాహెద్‌నగర్‌లోని మూసీ ఒడ్డున అగ్నిప్రమాదం

చెత్తకుప్పకు నిప్పు, ఉవ్వెత్తున లేచిన మంటలు



మూసీ ఒడ్డున ఎగిసిపడుతున్న మంటలు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వాహెద్‌నగర్‌లోని మూసీ ఒడ్డున ఉన్న చెత్తకు ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట వాహెద్‌నగర్‌లోని గోల్నాకా బ్రిడ్జి సమీపంలోని మూసీ ఒడ్డున ఉన్న చెత్తకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో ఒక్కమారుగా మంటలు ఉవ్వెత్తున లేచాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చెత్తకుప్ప నుంచి లేచిన మంటలు స్థానికంగా వ్యాపించకపోవడంతో భారీ ముప్పు తప్పింది. విషయం తెలుసుకున్న మలక్‌పేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేడ్చల్ ప్రజలకు మరో కానుక

- రూ.15 కోట్లతో ఎయిర్‌పోర్టును తలపించే విధంగా రైల్వేస్టేషన్
- అమృత్ భారత్ కింద మేడ్చల్, మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌ల ఎంపిక
- నేడు ప్రధాని చేతుల మీదుగా వర్చువల్‌గా పనుల ప్రారంభం

మేడ్చల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్ ప్రజలకు రైల్వే శాఖ వారు మరో కానుక ఇవ్వనున్నారు. మేడ్చల్, మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లను అధునాతనంగా తీర్చిదిద్దేందుకు అమృత్ స్టేషన్‌లుగా ఎంపిక చేశారు. ఎయిర్‌పోర్టును తలపించే విధంగా అన్ని హంగులతో రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే మేడ్చల్ ప్రాంతం ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించటానికి మేడ్చల్-సికింద్రాబాద్ రైల్వే లైన్‌ను విద్యుదీకరణ చేసి ఎంఎంటీఎస్ ట్రైన్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం స్థానిక స్టేషన్‌ను అన్ని హంగులతో మోడల్ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు అమృత్ స్టేషన్ కింద ఎంపిక చేశారు. హైదరాబాద్ డివిజన్‌లో మొత్తం 17 రైల్వే స్టేషన్‌లను అమృత్ భారత్ కింద ఎంపిక చేసినట్టు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. వీటిలో మల్కాజిగిరి, మేడ్చల్ , కామారెడ్డి స్టేషన్‌లు ఉన్నాయి. జిల్లాకు చెందిన రెండు స్టేషన్‌ల అభివృద్ధికి దాదాపు రూ.30 కోట్ల వరకు ఖర్చు చేసి అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళికను రూపొందించినట్లు తెలిసింది. ఇప్పటికే స్టేషన్‌లో చేపట్టాల్సిన పనులపై రైల్వే శాఖ ఉన్నత అధికారులు సమీక్షిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు స్టేషన్‌లో చేపడుతున్న పనుల గురించి తనిఖీలు చేస్తున్నారు. అమృత్ భారత్ కింద రైల్వేస్టేషన్‌ను ఆధునీకరణకు చర్యలు చేపడుతున్నారు.

అమృత్ భారత్ కింద చేపట్టే అభివృద్ధి పనులు ఇవే..

అమృత్ భారత్ కింద రైల్వేస్టేషన్‌ను అధునాతనంగా అభివృద్ధి చేయడంలో భాగంగా అనేక మార్పులు, చేర్పులు చేయనున్నారు. ప్రస్తుతం స్టేషన్‌కు రెండు వైపుల ఉన్న ప్లాట్ ఫామ్‌లను పూర్తిగా అభివృద్ధి చేయటం జరుగుతుంది. రెండు ప్లాట్‌ఫారాలపై ప్రయాణికుల సౌకర్యార్థం విద్యుత్‌తో నడిచే ఎస్కిలేటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. రెండు వైపుల ప్రత్యేక టికెట్ కౌంటర్లను, వాహనాల పార్కింగ్, క్యాంటీన్, ప్రయాణికులకు విశ్రాంతి గదులు, మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా టాయిలెట్లు ఏర్పాటు చేస్తారు. రిజర్వేషన్ కౌంటర్లు, రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణీకులు కూర్చొవటానికి కుర్చీలు, వినోదానికి సంబంధించిన పరికరాలు ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు స్టేషన్‌కు డ్రాప్ చేయటానికి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్సులు నేరుగా స్టేషన్‌కు దగ్గరగా చేరుకునే విధంగా పనులు చేపడుతున్నారు. స్టేషన్ ఆధునీకరణ పూర్తిగా విమానాశ్రయాన్ని తలపించే విధంగా ఉంటుందని అధికారులు తెలిపారు. మోడల్ రైల్వే స్టేషన్ సకల సౌకర్యాలతో ఏర్పాటు చేయటంతో పాటు ప్రత్యేకంగా ఇక్కడి నుంచి కొన్ని ట్రైన్‌లను ప్రారంభించేందుకు వీలుంది. దీనికి తోడు కొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లు ఆగే వీలు కల్పిస్తున్నారు. వీటితో పాటు రైల్వే స్టేషన్‌ల పరిసరాలను సుందరీకరణతో తీర్చిదిద్దటానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారు.

గుండ్లపోచంపల్లి , గౌడవెల్లి ఆర్‌యూబీ పనులకు శంకుస్థాపన

గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి రైల్వేగేట్ల వద్ద నిర్మించే ఆర్‌యూబీ పనులకు నేడు ప్రధాన మంత్రి మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించడం అభినందనీయం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



ఎమ్మెల్యే బాలునాయక్‌ను సన్మానిస్తున్న బంజారా సంఘం నాయకులు



సేవాలాల్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

చంపాపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సంత్ సద్గురు సేవాలాల్ జయంతి రోజును సీఎం రేవంత్‌రెడ్డి సెలవుదినంగా ప్రకటించడం అభినందనీయం అని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని క్రాంతిక్లబ్ ఆవరణలో ఆదివారం కేతావత్ అమల గోపిసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ 285 వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ లక్ష్మణ్, ప్రొఫెసర్ శంకర్‌నాయక్, వెంకటేశ్‌నాయక్, హనుమాన్ ఆలయ ధర్మకర్త నారగోని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సాహెబ్‌నగర్‌లో సంత్ సేవాలాల్ జయంతి

వనస్థలిపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బీఎన్ రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్ ఆంజనేయస్వామి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంత్ సేవాలాల్ మహారాజ్ బజరంగ్ దళ్ అధ్యక్షుడు భరత్‌లాల్‌నాయక్, నాయకులు రాంబాబునాయక్, రవికుమార్, చందునాయక్, సుమానినాయక్, గణనాయక్ పాల్గొన్నారు.